కరువు పరిస్థితులను కేంద్ర బృందానికి వివరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

'ముదివేడు' రైతులను ముంచేశారు!

- మూడేళ్లుగా చెల్లించని పరిహారం
- రైతులకు చెల్లించాల్సింది రూ.10 కోట్లు పైమాటే
- భూములిచ్చి రోడ్డున పడ్డ 300 రైతు కుటుంబాలు
- సాయం కోసం ఎదురుచూస్తున్న భూ బాధితులు

ముదివేడు ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వారంతా సామాన్య రైతులు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు. అనాదిగా భూములనే నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రాణాలు. వారి జీవనాధారమైన వ్యవసాయ భూములను ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వానికి అప్పజెప్పి సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రభుత్వం ఇస్తామన్న నష్టపరిహారం కోసం మూడేళ్లుగా ఎదురు చూస్తూ కాలం వెల్లదీస్తున్నారు. వారే ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ బాధితులు. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని కురబలకోట, బి.కొత్తకోట మండల పరిధిలో రూ.759.50 కోట్ల అంచనాతో గత ప్రభుత్వం 2021-22లో పిచ్చలవాండ్లపల్లి పంచాయతీ పరిధిలో 1,200 ఎకరాల విస్తీర్ణంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను 1.96 టిఎంసిల నీటి సామర్థ్యంతో నిర్మాణాన్ని ప్రారంభించింది. ఇందుకుగాను 300 మంది రైతుల నుంచి సుమారు వెయ్యి ఎకరాలకుపైగా సారవంతమైన వ్యవసాయ భూములను పోగేసింది. ఆ సమయంలో ఎకరాకు రూ.12.5 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని, నష్టపరిహారం అందే వరకు ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు చొప్పున గుత్త చెల్లిస్తామన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం వ్యవసాయ భూములతో పాటు గ్రామాలు, చెరువులు, కుంటలను తీసుకున్నారు. ఈ క్రమంలో కురబలకోట మండలంలోని పిచ్చలవాండ్లపల్లి పంచాయతీలో 796.7 ఎకరాలు, కురబలకోట పంచాయతీలో 66.70 ఎకరాలు, ముదివేడు పంచాయతీలో 64.95 ఎకరాలు, బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీలో 146.05 ఎకరాలు ఎంపిక చేసి ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ అనుమతులు లేవని గ్రీన్ ట్రిబ్యునల్ ప్రభుత్వానికి రూ.100 కోట్ల జరిమానా విధించడంతో ప్రాజెక్టు పనులను అర్ధాంతరంగా ఆపేశారు. ప్రాజెక్టు పనులు ఆగిపోవడం, వెనువెంటనే సార్వత్రిక ఎన్నికలు రావడం చకచకా జరిగిపోయాయి. ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ 300 పేద రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందలేదు. కట్ట నిర్మాణానికి అవసరమైన మట్టిని రైతులకు చెందిన 400 ఎకరాల వ్యవసాయ భూముల నుంచి మట్టిని తరలించారు. ఏడాదికి రెండు, మూడు పంటలు పండే ఆ భూములు సారవంతాన్ని కోల్పోయి వ్యవసాయానికి పనికిరాకుండా పోయాయి.

పునరావాస కల్పనలోనూ తీవ్ర నిర్లక్ష్యం

ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు పూర్తి అయితే కురబలకోట మండలం, పిచ్చలవాండ్లపల్లి పంచా యతీలోని శీతివారిపల్లి, కొత్తపల్లి, బి.కొత్తకోట మండలం, కోటూరు పంచాయతీలోని చౌటకుంటపల్లి, దిన్నమీద గ్రామాలు పూర్తిగా మునిగిపోతాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పిచ్చలవాండ్లపల్లి పంచాయతీలో 204 కుటుంబాలు, కోటావూరు పంచాయతీలో 125 కుటుంబాలను పునరావాసం కోసం ఎంపిక చేసి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్థలాలను ఎంపిక చేసి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఆ ప్రకారం పిచ్చలవాండ్లపల్లి పంచాయతీలోని భూ నిర్వాసితులకు ముదివేడు క్రాస్ సమీపంలోని తానామిట్ట వద్ద 21.50 ఎకరాలు, బి.కొత్తకోట మండలంలోని కోటావూరు నిర్వాసితుల కోసం 13.5 ఎకరాలు ఎంపిక చేసింది. ఒక్కో కుటుంబానికి గృహ నిర్మాణం కోసం 5సెంట్ల స్థలాన్ని ఇవ్వడంతో పాటు, అక్కడ అన్నిరకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకునేవారికి వారికి రూ.10 లక్షల ఆర్థికసాయం, అలా నిర్మించుకోలేని వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు మిగిలిన పైకాన్ని వారికే అందజేస్తామన్నారు. ప్రాజెక్టు చేపట్టి మూడేళ్లు అవుతున్నా ఇంతవరకు భూ నిర్వాసితులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తోంది.

రాజకీయ క్రీనీడలో రైతులే బలి

గత వైసిపి ప్రభుత్వంలో 2021-22లో ప్రాజెక్టు నిర్మాణం కోసం రైతులకు ఇష్టం లేకపోయినా భూములను అప్పగించాల్సి వచ్చింది. రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. ప్రాజెక్టు నిర్మాణమే నిబంధనలకు విరుద్ధంగా ఉందంటూ కొంతమంది టిడిపి సానుభూతిపరులు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి పనులను ఆపు చేయించారు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికలు రావడం, ప్రాజెక్టును ప్రారంభించిన వైసిపి ఘోరంగా ఓడిపోవడం, కూటమి హయాంలో ప్రాజెక్టు చేపట్టలేదన్న ఉద్దేశమో, లేక మరే కారణం చేతనో కానీ ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ బాధితులకు మాత్రం న్యాయం జరగలేదు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తవుతున్నా కనీసం ఈ విషయాన్ని ప్రస్తావించకపోవడాన్ని చూస్తుంటే రాజకీయ క్రీనీడలో బలి పశువులైంది మాత్రం పేద రైతులేననేది సుస్పష్టంగా తెలుస్తోంది. కలెక్టర్ స్పందించి దగాపడ్డ బాధిత రైతులను ఆదుకోవాల్సి ఉంది.

కట్ట కోసం 3 ఎకరాలు పోగొట్టుకున్నా

ప్రాజెక్టు కట్ట నిర్మాణం కోసం జీవనాధారమైన 3 ఎకరాల పొలాన్ని, పుష్కలంగా నీరు వస్తున్న బోరును వదులుకున్నా. ఓ పక్క వ్యవసాయం లేదు. ప్రభుత్వం ఇస్తామన్న పరిహారం అందలేదు. కుటుంబం రోడ్డున పడింది.

- పెద్దరెడ్డెప్పరెడ్డి, బాధిత రైతు, పిచ్చలవాండ్లపల్లి.

మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా

మా కుటుంబానికి ఆసరాగా ఉన్న 9 ఎకరాల వ్యవసాయ భూమిని ప్రాజెక్టు కోసం తీసుకున్నారు. పిల్లల చదువులు భారంగా మారాయి. సంపాదన లేక ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. నష్టపరిహారం కోసం మూడేళ్లుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం. అయినా మాకు న్యాయం జరగలేదు.

- వెంకటేశ్వరమ్మ, మహిళా రైతు, పిచ్చలవాండ్లపల్లి.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి

బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం బలవంతంగా పేద రైతుల భూములు లాక్కొంది. పార్టీలకతీతంగా నష్టపోయిన రైతులకు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఆర్అండ్ఆర్ ప్యాకేజి అందించి ఆదుకోవాలి

- హరినాథశర్మ, సిఐటియు నాయకులు.

రైతులతో రాజకీయ పార్టీల చెలగాటం దుర్మార్గం

రైతుల జీవితాలతో రాజకీయపార్టీలు చెలగాటం ఆడడం దుర్మార్గం. ఐదేళ్లకోసారి పార్టీలు అధికారంలోకి వస్తుంటాయి.. పోతుంటాయి. ప్రభుత్వాలు మాత్రమే శాశ్వతం. గత ప్రభుత్వం చేసిన పనులకు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానిదే బాధ్యత. ప్రభుత్వ కార్యకలాపాల ద్వారా నష్టపోయిన ప్రజలను, అన్నదాతలను ఆదుకోవడం ప్రభుత్వాల విధి. కావున ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ భాదితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి, పునరావసం కల్పించి ఆదుకోవాలి. లేదంటే సిపిఎం ఆధ్వర్యంలో పోరుబాట పట్టి, ఆందోళనలు చేపట్టి, ప్రభుత్వం దిగొచ్చి బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.

- పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కన్వీనర్, అన్నమయ్య.

జెసిబితో కంచె తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

న్యాయం చేయండి సారూ...!

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : తన పట్టా భూమిలో రూ.5 లక్షలు ఖర్చు చేసి వేసుకున్న కంచెను రెవెన్యూ అధికారులు ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా అన్యాయంగా తొల గించారని మండల పరిధిలోని చిన్నిల్లుగారి పల్లెకు చెందిన యువరైతు రఘు నాథరెడ్డి తనకు న్యాయం చేయండంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 1212లో తన తండ్రి పేరిట ఉన్న 5.5 ఎకరాల పట్టా భూమిలో కొంత డికెటి భూమి ఉందని, ఇటీవల ఆ భూమిలో రూ.5 లక్షలతో కంచె ఏర్పాటు చేసుకుంటే మొదట రోడ్లు, భవనాల శాఖ వారు ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు తన భూమి కొంత భాగం ప్రభుత్వాధీనంలోని భూమిలోకి వచ్చిందని, ఏర్పాటు చేసుకున్న కంచెను తొలగించాలని సూచించినట్లు తెలిపారు. అదే విషయం లిఖితపూర్వకంగా ఇస్తే తాను తొలగించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపినా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించు కోకుండా వారి కోసం రెండు నెలలు పని ఆపి ఎదురు చూసినా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేశారన్నారు. తీరా కంచె వేసుకున్నాక ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా రెవెన్యూ వారు బుధవారం తహశీల్దార్ పీరు మున్నీ, ఆర్ఐ శేషం రాజు, విఆర్ఒ సుధాకర్, సర్వేయర్ దామోదర్ రెడ్డి సిబ్బందితో కలిసి జెసిబితో దౌర్జన్యంగా కంచె తొలగించారని ఆవేదన చెందారు. తనకు జరిగిన అన్యాయంపై జిల్లా కలెక్టర్ ను కలిసి న్యాయం చేయమని కోరనున్నట్లు తెలియజేశారు. ఈ ఘటనపై తహశీల్దార్ పీరు మున్నీని వివరణ కోరగా కేవలం ప్రభుత్వ భూమిలోకి చొరబడిన కంచె మాత్రమే తొలగించామని తెలిపారు. పట్టా భూమిలో తాము జోక్యం చేసుకోలేదని తెలియజేశారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ప్రస్తుత సమాజంలో రాణించాలంటే విద్యార్థులలో పోటీ తత్వం అలవాడాలని ఎంఇఒ-2 సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం వైబిఎన్ పల్లె ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గేని పెంచలయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పద్యాల పోటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్యాలు రాయడం, వల్లె వేయడం ద్వారా విద్యార్థుల మేధస్సు మెరుగుపడుతుందని, వారిలో సృజనాత్మకత అలవడుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు గేని పెంచలయ్య మాట్లాడుతూ సాతపల్లె, డిబిఎన్ పల్లె, ధనాసి పల్లె, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలకు చెందిన 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరిగిందని వివరించారు. ఈ పద్య పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయినీలు కాంచన, అమ్ములు వ్యవహరించారని తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయనీలు సాహిత్య, పూర్ణిమ, మదాలస పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ సుబ్బరాయుడు

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి)

విద్యార్థికి మెమొంటో అందజేస్తున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

మార్చిలో నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం సూచించారు. బుధవారం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. సిలబస్ పూర్తయిందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి పునాది వంటిదన్నారు. లక్ష సాధన కోసం పట్టుదల, అంకితభావంతో బాగా చదవాలన్నారు. పరీక్షలలో చూచి రాతలు ఉండవని, అత్యంత పగడ్బందీగా పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగ్రహణాత్మక పరీక్షలలో వచ్చిన మార్కులు ఆధారంగా పదవ తరగతి విద్యార్థులను ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించాలన్నారు. డి గ్రూపులోని విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక అనుసరించాలన్నారు. ముఖ్యమైన భావనలపై, పట్టికలపై, పటాలపై వారికి తర్ఫీదు ఇవ్వడం ద్వారా వారిని కూడా ఉత్తీర్ణులను చేయవచ్చన్నారు. సబ్జెక్టు వారీగా ముఖ్యమైన మూడు మాదిరి ప్రశ్నాపత్రాలను రూపొందించాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ఎస్‌సిఇఆర్‌డి రూపొందించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం ఏకలవ్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు రుక్సానా, మౌనిక, తరుణ్ కుమార్ గౌడ్‌లకు మెమొంటోలను ఇచ్చి వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, ఏకలవ్య పాఠశాల కో-ఆర్డినేటర్ రెడ్డి శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం అధోగతి

- ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాదక ద్రవ్యాల వినియోగం వలన జీవితం అధోగతి పాలతుందని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు విద్యార్థులకు సూచించారు. బుధవారం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అన్నమాచార్య యూని వర్సిటీ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అన్నమాచార్య యూని వర్సిటీ రజతోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధ వారం ఉదయం సే నో టు డ్రగ్స్-వాక్ అగైనెస్ట్ డ్రగ్స్ పేరిట భారీ ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీ ప్రారంభో త్సవంలో ఎస్‌పితో పాటు విసి డాక్టర్ చొప్పా గంగిరెడ్డి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విద్యా ర్థులు డ్రగ్స్, ఇతర మాదకద్ర వ్యాలకు బానిస కాకుండా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ప్రాంగణం నుంచి పట్టణం కొత్త బస్టాండ్ మీదుగ పాతా బస్టాండ్ వరకు ఐదు కిలోమీటర్ల భారీ ర్యాలీ నిర్వహించారు. రాజంపేట పాత బస్టాండ్ వద్ద మానవహారంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముందు ప్రముఖ సినీ నటులు, వ్యక్తిత్వ వికాస శిక్షకులు కెవి.ప్రదీప్ విద్యార్థులను తన ప్రేరణ ప్రసంగంతో ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో డిఎస్‌పిఎన్. సుధాకర్, అన్నమాచార్య యూనివర్సిటీ అన్నమయ్య ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, ట్రస్ట్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రోఛాన్సలర్ అభిషేక్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లిఖార్జునరావు, యోనో ఎస్‌బిఐ రాజంపేట రీజనల్ మేనేజర్ మురళి, డీన్‌లు, హెచ్ఒడిలు, అధ్యాపకుల, భారీగా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెలుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

కరువు మండలాలకు సాయమందించండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లాలో తీవ్రమైన కరువును ఎదుర్కొన్న మండలాలకు కేంద్ర ప్రభుత్వ సాయం అవసరమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. జిల్లాలో కరువు మండలాల క్షేత్ర పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వం సుప్రియ మాలిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల బృందం, జిల్లాలోని బి.కొత్తకోట, వాల్మీకిపురం, మదనపల్లె, తంబళ్లపల్లె, తదితర మండలాలను సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ బృందం వివిధ మండలాలను సందర్శించిన సందర్భంగా కేంద్ర బృందం, ఖరీఫ్ సీజన్లో పడిన వర్షపాతం, పశువులకు అందుబాటులో ఉన్న పశుగ్రాసం, పండించిన పంటల నష్టాలు తదితర విషయాలపై స్థానిక రైతులతో చర్చించారు. గతంలో లాగా రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వాలు పశుగ్రాసం అందించగలిగితే తమకు ఎంతో సహాయంగా ఉంటుందని కొంత మంది రైతులు కేంద్ర బృందానికి తెలిపారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న వివిధ రకాల పథకాలను ఉపయోగించుకొని పశుగ్రాసం సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. మండలాలను సందర్శించిన అనంతరం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో కేంద్ర బృందం కలెక్టర్ శ్రీధర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లాలో నమోదైన కరువు తీవ్రత కరువు మండలాలపై కేంద్ర బృందానికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్‌లో జిల్లాలోని 19 మండలాలను తీవ్రమైన కరువు మండలాలుగా ప్రకటించిందని తెలిపారు. ఖరీఫ్ 2024 సీజన్‌లో జూన్ నుండి సెప్టెంబర్ వరకు వర్షపాతం చాలా తక్కువగా నమోదైందని, తద్వారా పలు మండలాలలో కరువు నమోదైందని, కేంద్ర బృందానికి తెలిపారు. పశువులకు పశుగ్రాసం తక్కువగా అందుబాటులో ఉందని దీనివల్ల ఎంతోమంది రైతులు నష్టపోయారని బృందానికి తెలిపారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం కరువు పీడిత మండలాలకు సుమారు రూ.11 కోట్లు సాయం అందించాల్సి ఉందని పేర్కొన్నారు. గ్రామ, మండలాల స్థాయిలో బృందాలను ఏర్పాటు చేసి కరువు మండలాలలో పంట నష్టాలపై నివేదికలను తీసుకున్నామని, కరువు మండలాలలో దాదాపు 33 శాతం పంట నష్టం వచ్చిందని తెలిపారు. వేరుశనగ పంట వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వ్యవసాయం మీద కాకుండా పశువులపై ఆధారపడి జీవనం సాగించే రైతులు కూడా ఎంతో నష్టపోయారని పేర్కొన్నారు. వర్షపాతం నమోదు తక్కువగా ఉండడంతో వివిధ రిజర్వాయర్లలో నీరు తక్కువగా ఉండటం వల్ల కరువు మండలాలలో ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను అందించినట్లుగా పేర్కొన్నారు. అనంతరం, జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా పశుసంవర్ధక శాఖ, జిల్లా ఉద్యానవన శాఖ, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా శాఖ తదితర శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన వివిధ విషయాలపై కేంద్ర బృందానికి వివరించారు. సమావేశంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, పాల్గొన్నారు.

మొక్కుబడిగా జడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశం

- సంక్షేమ పథకాల అమలుపై ప్రశ్నాస్త్రాలు
- బెడెడ్ రోగుల పింఛన్ల సర్వేపై నిలదీత
- పలువురు జడ్‌పిటిసిలు గైర్హాజర్..నిరీక్షణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు మొక్కుబడిని తలపించాయి. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ హాలు, డిపిఆర్‌సి హాలుల్లో జడ్‌పి సిఇఒ సి.ఓబులమ్మ, డిప్యూటీ సిఇఒ మైథిలి అధ్యక్షతన నిర్వహించారు. మొదటగా పోరుమామిళ్ల జడ్‌పిటిసి చెన్నయ్య జిల్లాలో పంచాయతీ రాజ్ రహదారులు అధ్వానంగా ఉన్నాయని, ప్రతి సమావేశంలో ప్రస్తావనకు వస్తున్నప్పటికీ ఎటువంటి స్పందన లేకుండా పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరాలసిస్ తదితర బెడెడ్ రోగుల పింఛన్లపై సర్వే ఉద్దేశం ఏమిటో తెలియ జేయాలని నిలదీశారు. పెరాలసిస్ రోగులు ప్రారంభదశలో మెరుగైన వైద్యం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడి ఉంటుందని, అటువంటి రోగుల పింఛన్ ఇప్పుడు తొలగించడం ఏమిటని నిలదీశారు. జిల్లాలో వేలాది మంది పింఛన్ల తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. డిఆర్‌డిఎ పీడీ స్పందిస్తూ రాష్ట్రంలో 15 వేల వరకు బెడెడ్ రోగులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించిందని, ఆమేరకు జిల్లాలోనూ బెడెడ్ రోగులపై సర్వే మాత్రమే చేపట్టాలని ఆదేశించిందని, బెడెడ్ రోగుల ఆరోగ్యం మెరుగుపడి ఉంటే వైద్య నిపుణుల సిఫారసు మేరకు వ్యాధి తీవ్రత ఆధారంగా వైద్యులు ఇచ్చే సిఫారసుల ఆధారంగా పింఛన్ తగ్గించడమా, తొలగించడమా అనేది ఉంటుందని తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల ఫిర్యాదు మేరకు జిల్లాలో 3,400 అక్రమ పింఛన్‌లపై విచారణ చేపట్టామని తెలిపారు. ఉపాధి హామీ పనులకు వెళ్తున్న వారికి డిజేబుల్ పిం ఛన్లు ఉన్నట్లు గుర్తించామని, అటువంటి పింఛన్లు తొలగింపునకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం అక్రమ పింఛన్ల తొలగింపుపై ఎనిమిది మంది మంత్రులతో కమిటీ వేసిందని, కమిటీ సిఫారసుల ఆధారంగా చర్యలు ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఖాజీపేటకు చెందిన జడ్‌పి కో-ఆప్షన్ సభ్యులు కరీముల్లా మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ద్వారా శ్మశానాలను అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ యంత్రాంగం వేసవి సీజన్ రానున్న నేపథ్యంలో సిపిడబ్ల్యు స్కీముల పనితీరు మెరుగు పరచాలని జడ్‌పి సిఇఒ సి.ఓబులమ్మ ఆదేశించారు. జడ్‌పి సమావేశ హాలు సమావేశానికి హాజరు కావాల్సిన ముగ్గురు జడ్‌పిటిసిలు గైర్హాజరయ్యారు. డిపిఇఆర్‌సి సమావేశానికి పలువురు జడ్‌పిటిసిలు గైర్హాజర్ కావడంతో కొంతసేపు నిరీక్షించడం గమనార్హం. ఏదేమైనా కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన పలువురు జడ్‌పిటిసిలు, జిల్లా ఉన్నతాధికారులు హాజరై మొక్కుబడిగా సమావేశం గమనార్హం.

సమన్వయంతోనే ఎయిడ్స్ నివారణ

- అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ

ప్రజాశక్తి-రాయచోటి

సమన్వయంతో ఎయిడ్స్ నివారణ చేయవచ్చని అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని డైట్ కళాశాలలో ప్రథమ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి గురించి మాట్లాడుకున్నపుడే ప్రజల్లో చైతన్యం వస్తుందన్నారు. జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణా కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న ఐసిటిసి కేంద్రాలు, సురక్షా కేంద్రాలు, ఎఆర్‌టి కేంద్రాలు, రక్తనిధులు, స్వచ్ఛంద సమస్థలు తదితర సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని అప్పుడే జిల్లాకు కేటాయించినా లక్ష్యాలను చేరుకోగలమని పేర్కొన్నారు. జిల్లాలో 9 ఐసిటిసి కేంద్రాల ద్వారా పరీక్షా సేవలు అందిస్తున్నామని, వ్యాధిగ్రస్తులుకు ఎఆర్‌టి కేంద్రాల ద్వారా జీవిత కాలంఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛంద సమస్థలు హైరిస్క్‌లో ఉన్నవారిని గుర్తించి క్షేత్ర స్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమములో ఎపి సాక్స్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్, పర్యవేక్షలు ప్రసాద్, జిల్లా సిబ్బంది పుల్లయ్య, సిలార్ సాబ్, సాదిక్, చైల్డ్ ఫర్ ఇండియా జిల్లా రిసోర్స్ పర్సన్ అల్లావలి, జిల్లా పాసిటివ్ నేట్ వర్క్ అధ్యక్షులు ఉషారాణి, ఐసిటిసి సురక్షా కేంద్రాల కౌన్సెలర్లు, ఎఆర్‌టి సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సిబ్బంది, ఎపి సాక్స్ పార్టనర్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ లక్ష్యాలను పాఠ్యాంశాల్లో చేర్చాలి

ప్రజాశక్తి-రాయచోటి

సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్

భారత రాజ్యాంగ లక్ష్యాలను విద్యార్థి దశ నుండే ప్రతి విద్యార్థి తెలుసు కోవడానికి పాఠ్యాంశాలలో భారత రాజ్యాంగ లక్ష్యాలను చేర్చాలని భారత న్యాయ వాదుల సంఘం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ అన్నారు. భారత రాజ్యాంగం చట్టాలపై అవగాహన న్యాయ చైతన్య సదస్సును అనే అంశంపై బుధ వారం స్థానిక శ్రీ చందన శ్రీ ఒకేషనల్ జూనియర్ కాలేజ్‌లో నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ మనదేశంలో ఐదువేల పైచిలుకు కులాలు, పదుల సంఖ్యలో మతాలు ఉన్నాయని అన్నారు. భారత రాజ్యాంగం దేశంలోని అన్ని కుల మతాల హక్కులను రక్షించే విధంగా భారతదేశంలో ఒక పవిత్ర గ్రంథంగా ఉందని రాజ్యాంగం ఆధారంగానే దేశంలోని అన్ని చట్టాలు తయారవుతాయని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే భారత రాజ్యాంగం లక్ష్యాల గురించి విద్యార్థి దశ నుండి తెలుసుకోవడానికి పాఠ్యాంశాలలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళా చట్టాల గురించి న్యాయవాది ఆనంద్ కుమార్, బాల్య వివాహాల చట్టం గురించి న్యాయ వాదిపై రెడ్డయ్య, ట్రాఫిక్ చట్టాల గురించి న్యాయవాది ధనుంజయ్ కుమార్, పర్యా వరణం గురించి న్యాయవాది నాగముని ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధిక చట్టం గురించి న్యాయవాది రవిశంకర్ ఇతర చట్టాల గురించి హెూమియోన్‌బాషా, ఆర్‌డి ఆనంద్ మాట్లాడారు. ఎఐఎస్ఎఫ్ కోటేశ్వరరావు, చందన శ్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాల రాజేశ్వరమ్మ, ప్రిన్సిపల్ సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు భారత రాజ్యాంగంపై చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు రెడ్డికిషోర్‌రెడ్డి, సుచరిత

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెన్నముక్కపల్లెకు చెందిన ముదిరెడ్డి రెడ్డి కిషోర్‌రెడ్డి, సుచరిత దంపతుల కుమార్తె హేమశ్రీరెడ్డి రెండో పుట్టినరోజు పురస్కరించుకొని బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు కిషోర్‌రెడ్డి దంపతులు మాట్లాడుతూ తమ బిడ్డ పుట్టినరోజు పురస్కరించుకొని వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషాన్ని ఇస్తుం దన్నారు. ఇకపై మా కుటుంబంలో ఇలాంటి వేడుకల్లో ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తామని అన్నారు. మాకు ఈ అవకాశానికి సహకరించిన రాయచోటి లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ మహబూబాషాకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ వి.హరీష్, చంద్ర దాతల కుటుంబ సభ్యులు మహేశ్వర్‌రెడ్డి, శ్రీవాణి, హరీష్, వేణుగోపాల్ రెడ్డి, సుశీల, వృద్ధాశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోన విద్యార్థులు

ప్రజాశక్తి-కలకడ

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన యోగేశ్వర్, సమీరా

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోన జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మోడెమ్ చెంగల్ రా యుడు తెలిపారు. గత సంవత్సరం రాజ మండ్రి, విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మిడపల యోగేశ్వర్, షేక్ సమీరా జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 10 నుంచి తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో జరిగే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ఆడనున్నట్లు తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఆకుల ఝాన్సీరాణిని, ఎంపికైన విద్యార్థులను, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

11న జిల్లా స్థాయి హాకీ టీం ఎంపిక

మదనపల్లి : స్థానిక బిటి కళాశాల హాకీగ్రౌండ్‌లో ఈ నెల 11న ఉదయం 9 గంటలకు అన్నమయ్య జిల్లా హాకీఅసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ టీం ఎంపిక జరుగుతుందని అధ్యక్షులు పి.వి.ప్రసాద్, సెక్రటరీ బి.శివప్రసాద్, కన్వీనర్ హితేష్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎంపిక నందు పాల్గొనే క్రీడాకారులు 01-01-2009 తేదీ తరువాత పుట్టినవారు అయ్యిఉండాలని, వారి వెంట జనన ధ్రువీకరణ పత్రం,ఆధార్ కార్డు తప్పక తీసుకొని రావాలని సూచించారు. అలా తెచ్చిన వారు మాత్రమే ఎంపిక ప్రక్రియకు అర్హులుఅని తెలిపారు. మరిన్ని వివరాలుకు 9494743425, 9441152481 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

టిడిపి మండల బిసి సెల్ అధ్యక్షులుగా గురుశేఖర్

ప్రజాశక్తి-రామాపురం

మండల బిసి సెల్ అధ్యక్షులుగా కల్పనాయిని చెరువు గ్రామానికి చెందిన కొండబోయన గురుశేఖర్ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు వద్ద నుంచి నియామకపు పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. తన ఎంపికకు సహ కరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బిసి సెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్, రామాపురం టిడిపి నాయకులకు, బిసి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపిలో పలువురికి పదవులు

ప్రజాశక్తి-నందలూరు



అనుదీప్ సుధాకర్

వైసిసి అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నందలూరు మండలానికి చెందిన పలువురికి పార్టీలో పదవులు లభించాయి. వైసిపి లీగల్ విభాగం జిల్లా అధ్యక్షులుగా నాయనపల్లి అనుదీప్, జయసింహ, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా నడివీధి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా సిద్దవరం గోపిరెడ్డి, ఆర్గనైజేషన్ సెక్ర టరీగా గొబ్బిల త్రినాథ్‌ని నియమిస్తూ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ తమ సేవలను గుర్తించి ఈ పదవులను ఇచ్చిందన్నారు. జిల్లాలో పార్టీ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తా మన్నారు. తమ నియామకానికి సహకరించిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి ఆకేపాటి అనిల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జగన్‌ను కలిసిన ఎస్‌సి సెల్ నాయకులు

ప్రజాశక్తి-రామాపురం : మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మండల ఎస్‌సి సెల్ నాయకులు బుధవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైసిపి ప్రధాన కార్యదర్శి , గడికోట శ్రీకాంత్ రెడ్డిఆధ్వర్యంలో కలిశారు. పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్ఆర్ పార్టీని గడికోట శ్రీకాంత్ రెడ్డి వదలకుండా అధికారంలో ఉన్నప్పుడు అధికారం కోల్పోయినా ఎన్ని కష్టాలు వచ్చినా శ్రీకాంత్ రెడ్డి అడుగుజాడల్లోనే నడుస్తు పార్టీని నమ్ముకుని ఉన్నా మని తెలిపారు. వారిని ఉద్దేశించి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేస్తున్న మీకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. జగన్‌ను కలిసిన వారిలో అన్నమయ్య జిల్లా ఎస్‌సి సెల్ విజిలెన్స్ మాజీ సభ్యుడు సగినాలా శివ శంకర్ , ప్రసాద్, ఓబులేసు, చిన్న రెడ్డయ్య, మణికంఠ,గంగాధర, వీరా ఉన్నారు.

21 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లి ఆధ్వర్యంలో 21 ఉచిత క్యాటరాక్ట్ సర్జరీలు చేయించినట్లు లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మెన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి తెలిపారు. బుధవారం స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచిత క్యాటరాక్ట్ సర్జరీలు చేసుకొన్న 21 మందికి విజన్ టెస్టులు నిర్వహించారు. కంటి వైద్యులు సలహాలు, సూచనలు అందించి మందులు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ నివేదిత, పిఆర్‌ఒ గౌతంరెడ్డి పాల్గొన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE MUNIOR DIVISION : RLYKODUR

I.A.No. 533/2023 in O.S.No. 2/1992

Ruddirala Vijaya Bhargavi ...Petitioner/Plaintiff

Vs

R4. Pangam Venkatamma, W/o Jayaramaiah, Kothapalli H.W. Village, Rallacheruvupalli Village & Post, Obulavaripalli Mandal, Annamayya Dist.
R5. Naramalli Subhadramma, W/o Giri, D.No. 7/85, Raghavrajapuram H.W. Village, Kodur Mandal, Annamayya Dist.
...Respondents/Defendants

పై పిటిషనర్ మీ మీద మరియు రుద్దిరాల సుబ్బరాయుడు మరియు ఇంకొందరి మీద పై కోర్టు నందు దావా దాఖలు చేసివున్నారు. ఇందు విషయమై మీకేలాంటి ఆక్షేపణలు వున్న యెడల తేది: 5.2.2025న ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు నందు హాజరై ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని తెలుపుకొనగలరు. లేనంతటల పరోక్షంగా తీర్మానించబడును.

//By Order of the Court//
R.C.SURESH BABU
Advocate,
Rly.Kodur.

మహారాజశ్రీ పీలేరు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

H.M.O.P. No. 82 of 2024

శ్రీమతి సిబ్బాల మల్లిక. ...పిటిషనర్
Vs
శ్రీ పల్లా బాలకుమార్. ...రెస్పాండెంట్

రెస్పాండెంట్‌నకు నోటీసు

రెస్పాండెంట్ :
పల్లా బాల కుమార్, S/o పి.రామచంద్ర, డోర్‌నెం.123, సాయిరామ్ వీధి, సైనిక్ నగర్, పీలేరు పోస్ట్ & మండలం, అన్నమయ్య జిల్లా.

పై పిటిషనర్ దాఖలు చేసిన పై పిటిషన్ నందు మీ హాజరు నిమిత్తమై పై కేసును 29.01.2025వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో 29.01.2025 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

//By Order of Court//
ఎమ్.రామచంద్ర కుమార్, B.A., B.L.,
న్యాయవాది, పీలేరు.

మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా : ఎంపిపి

ప్రజాశక్తి-నందలూరు

మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరచి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఒ రాధాకృష్ణ అధ్య క్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల అభివృద్ధి కొరకు ప్రతి అధికారి, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నాయనపల్లి అనుదీప్, తుమ్మల భావన, మండల కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్, ఎంపిటిసిలు సోమిరెడ్డి సునీత, రమేష్ రెడ్డి, సుభాన్‌బాషా, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వద్దు : 'ముక్కా'

పుల్లంపేట : ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న రూపానందరెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని గొబ్బూరువారిపల్లి, చిన్నంపల్లి గ్రామంలో బుధవారం తహశీల్దార్ శ్రీధర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిం చారు. ఈ సదస్సులో కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో నూటికి 90 శాతం పైగా భూ సమస్యలు ఉన్నాయని భూ సమస్యల పరిష్కారానికి ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వ హించడం జరుగుతుందని రెవెన్యూ సదస్సులలో ప్రధానంగా భూ ఆక్రమణలు, అక్రమాలతో పాటు పలు రెవెన్యూ సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదు స్వీకరించి ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోగా సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి అధికారి రెవెన్యూ సదస్సులలో భాగస్వాములై చిత్తశుద్ధితో భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందనే నమ్మకాన్ని ప్రజలకు కల్పించి సమస్యలు పరిష్కరించాలని ఇకనుంచి బాధితులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంతవరకు అక్కడికక్కడే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్ రెడ్డి, ఆర్ఐ రామమోహన్, మాజీ ఎంపిపి తమ్మిద తిరుపాల్, ఆనంద గజపతిరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రామాపురం :** గ్రామాలలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సద స్సులు చేపట్టిందని తహశీల్దార్ రామాంజనేయులు అన్నారు. మండలంలోని చిట్లూరు సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామంలో భూ సమస్యలు ఉన్న పరిష్కరించుకోవడానికి ప్రజలు రెవిన్యూ సద స్సను వినియోగించుకోని పరిష్కరించుకోవాలన్నారు. దేవాదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ హాజరై మాట్లాడుతూ మండలంలో దేవుని మాన్యాల కింద 361 ఎకరాలు ఉండాలని ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో 161 ఎకరాలు మాత్రమే ఉందని. మిగిలిన భూమి ఎవరి ఆధీనంలో ఉందో తెలియజేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మని, వెంకటరమణ, టిడిపి మండల నాయకుడు సురేందర్ రెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, రామకృష్ణ గౌడ్, చెన్న కృష్ణారెడ్డి లక్ష్మయ్య పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-కలికిరి : ప్రతి గ్రామంలోనూ ఆట స్థలాలు, శ్మశాన వాటికలకు భూమిని కేటాయిం చాలని సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గుట్టపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో యు వకులు ఆట స్థలం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ భూము లు అన్యాక్రాంతం అవుతున్నాయని వెంటనే ఆటస్థలం కేటాయించాలని కోరారు. జి.బర్నేపల్లి, కె.బర్నేపల్లి, సి.బర్నేపల్లికి శ్మశాన ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ సదస్సు జరుతున్నట్లు గ్రామం మొత్తం ప్రచారం చేయకపోవడం వలన అనేక గ్రామాల ప్రజలకు తెలియలేదని అన్నారు. ప్రజలు ఇస్తున్న అర్జీలకు రసీదులు కూడా ఇవ్వకుండా తీసుకొని తర్వాత ఆన్‌లైన్ చేస్తామని నిర్లక్ష్యం సమాధానం చెబుతున్నారని తెలిపారు. కొన్ని ఆన్‌లైన్ చేయమని అవసరం లేదని చెప్పడం సరైంది కాదన్నారు. ప్రజలకు జవాబుదారుతనంగా ఉండాలని కనీసం ఆన్‌లైన్ చేస్తే సమస్య పరిష్కారం అయిందో లేదో తెలుస్తుందని ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అం దరికీ రెవెన్యూ సదస్సు జరుగుతున్నట్లు దండోరా రూపంలో కూడా వేయకపోవడం సరైంది కాదన్నారు. అధికారులు రాజకీయాల్లో పక్కనపెట్టి రాజకీయాలకు అతీతంగా పని చేయాలని పంచాయతీలో ప్రజల భూములు సంబంధించిన సర్వే నంబర్లు ఒకరి వి ఇంకొకరికి మారిపోవడం జరిగిందని వాటిని రీ సర్వేలో కూడా సరి దిద్దలేదన్నారు. ఇప్పుడైనా వాటిని సరిదిద్దాలని కోరారు. ప్రజలు అత్యధికంగా ఇబ్బం దులు పడుతున్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలనే ప్రభుత్వం లక్ష్యం నెరవేరాలంటే రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి భూ సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గంగరాజు

10న మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

36 జిఒను ఇంజినీరింగ్ కార్మికులకు అమలు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 10న శుక్రవారం జిల్లా లోని అన్ని మున్సిపల్ కార్యాల యాల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో జరిగే రిలే దీక్షలు జయప్రదం చేయా లని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.రామాంజులు, జిల్లా అధ్యక్షులు బండ్లమూడి వెంకటరమణ కార్మిక శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో వాటర్ సెక్షన్ ఫిట్టర్ ఎలక్ట్రిషి యన్లు గత ఏడేళ్లుగా వేతనాలు పెంచలేదన్నారు. 15 నుంచి 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్నా కేవలం రూ.15వేల పనిచేస్తున్నారని పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. కాజువల్ లీవులు, రిటైర్మెంట్ బెనిఫిట్, ఫెన్షన్, గ్రాట్యుటి, దహన సంస్కారాల ఖర్చులు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేసి హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కమీషనర్ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు యం.చెన్నయ్య, సిఐటియు నాయకులు మాధవయ్య, ఇంజినీరింగ్ కార్మికులు రమణారెడ్డి, దేవ, పివి.రమణ పాల్గొన్నారు.

భూ రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రీ సర్వే అవగాహన కార్యక్రమాన్ని మాచిరెడ్డిగారిపల్లి గ్రామ ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ధనంజయలు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడానికి భూ రీ సర్వే కార్యక్రమాన్ని ఈనెల 20 నుంచి మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆ గ్రామంలోని రైతులకు ముందుగా రీ సర్వేపై అవగాహన కల్పించి అపోహలను తొలగించడానికి ర్యాలీ చేపట్టి, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు దిగువమాచిరెడ్డిగారి పల్లెలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొనాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు భూ రీ సర్వే కార్యక్రమం చేపట్టడం గాను 16 మందిని నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు, ప్రజలు రీ సర్వే అవ గాహన కార్యక్రమానికి హాజరై సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొని, తమ భూముల సమస్యలను సరైన ధ్రువపత్రాలతో పరిష్కరించుకోవాలని తెలిపారు.

కార్పొరేట్‌కు ధీటుగా విద్యాబోధన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అత్యుత్తమ విద్యాబోధన అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం కళాశాల అధ్యాపకులు వెంకటరమణ, సాయిశంకర్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డిలతో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామారావు కాలనీలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కోర్పోరేట్, ప్రయివేట్ కళాశాలలకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో అత్యంత మార్కులు సాధించినట్లు తెలిపారు. నీట్, ఇఎపిసెట్, ఎఇ ఇఇలకు కోచింగ్ తోపాటు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.. యోగా, ధ్యానం కొరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన సౌకర్యం కూడా కల్పిస్తోందన్నారు. తల్లికి వందనం, స్కాలర్‌షిప్ వర్తిస్తాయని అన్నారు. ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో చేరి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

నాగిరెడ్డిపల్లెలో లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పశువులలో లింగ నిర్ధారిత వీర్యం ద్వారా మేలైన పెయ్యి దూడలు కలుగు తాయని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ విజయభాస్కరరావు తెలిపారు. బుధవారం మండలపరిధిలోని నారాపరెడ్డిపల్లె గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ, ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో జాతీ య కృత్రిమ గర్భదారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమములో 10 లింగనిర్ధారిత వీర్యం దూడలు, 38 కృత్రిమ గర్భదారణ ద్వారా పుట్టిన దూడలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పశువులలో ఎదకు రావడానికి, ఎద లక్షణాలు వాటి ప్రాముఖ్యతను వివరిం చారు. అనంతరం సహాయ సంచాలకులు డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ పశువులలో మేలైన యాజమాన్య పద్ధతులు, ఏడాదికి ఒక దూడ, వాటి ప్రాముఖ్యతను వివరిం చారు. కడప డిఎల్‌డిఎ డాక్టర్ శివ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రూ.1350లు ధర నిర్ణయించి లింగ నిర్ధారిత వీర్యం ప్రవేశపెట్టారన్నారు. సబ్సిడీ రూ.850, రైతు రూ.500 చెలిస్తే లింగ నిర్ధారిత వీర్యం అందిస్తోందని అన్నారు. కార్యక్రమములో జెవిఒ వరదయ్య, ఎల ఎస్ఎ వెంకటసుబ్బయ్య, విఎల్ఒలు ఆనంద్ బాబు, పెంచల్ రాజు, జెవిఒ భాను, సిబ్బంది, రైతులు పాల్గొనారు.

రామసముద్రంలో చిరుతపులి కలకలం

ప్రజాశక్తి-రామసముద్రం : మండలంలోని కెసి.పల్లి పంచాయతి గుంతయంబాడీ గ్రామ సమీ పంలో చిరుతపులి కనిపించినట్లు స్థానిక వై.కురప్పల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ అనే రైతు తెలిపారు. బుధవారం ఉద యం రైతు పొలం వద్దకు వెళుతూగుంతయంబాడి పెద్ద చెరువు కీలేరు నుంచి చెరువుకట్టపైకి ఎక్కుతున్న చిరుతను గమనించాడని అన్నారు.భయంతో ఈ విషయాన్ని గ్రామస్థులకు చెప్పగా వారు చిరుత కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారని అన్నారు. స్పందించిన బీట్ ఆఫీసర్ చిట్టిబాబు చిరుత సంచరించిన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలాలకు వెళ్లేటప్పుడు శబ్దాలు చేస్తూ వెళ్లాలని ఒంటరిగా ఎవరు వెళ్లకూడదని, కూర్చోవడానికి ప్రయత్నం చేయకూడదని హెచ్చరించారు.

పంచాయతీ ఇఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్‌పై దాడికి పాల్పడిన ఈఓ గురు మోహన్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా, వార్డు సభ్యులు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ లతీఫ్ ఖాన్‌కు వినతి పత్రం సమర్పించారు. బుధవారం వారు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒను కలసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పీలేరు పంచాయతీ ఇఒగా గురుమోహన్ బాధ్యతలు చేపట్టినప్పటినుంచి పంచాయతీ సిబ్బందితో పాటు ప్రజలు కూడా నిరసన పడుతున్నట్లు చెప్పారు. స్థానిక, వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోరుతూ కలిసే ప్రజల పట్ల ఇఒ అమర్యాదకరంగా మాట్లాడతారని ఆరోపించారు. బోర్డు తీర్మానాలను కూడా వ్యతిరేకిస్తూ నియంతలా వ్యవహరిస్తూ, ఒక రాజకీయ వేత్తలా ప్రెస్‌మీట్‌లు పెడుతున్నారని విమర్శించారు. ఈ నెల 7న సాయంకాలం పంచాయతీ ఆఫీసులో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్ దళిత సామాజిక వర్గానికి చెందిన రమణపై దాడి చేశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన సిసి టివి ఫుటేజ్ ని పరిశీలించి నిజా నిజాలను అధికారులు అర్థం చేసుకోవాలని కోరారు. ఇఒ చేసిన ఈ దాడిని పీలేరు మేజర్ పంచాయతీ బోర్డు సర్పంచ్, సభ్యులమైన తాము దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎంపిడిఒ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

చిన్నమండెం : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కోనయ్యగారిపల్లి గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకర్ మాట్లాడుతూ రబీకు సంబంధించిన ఇ-పంట నమోదు రైతులందరూ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి మస్తాన్ మాట్లాడుతూ రైతులందరూ కూడా ప్రకృతి వ్యవసాయం చేయాలని, ప్రతి సోమవారం మండల కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం జరుగుతుందని తెలిపారు. కుటుంబానికి సంబంధించి కూరగాయలు, ఆకుకూరలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించుకొని తినడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని రైతులకు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో ద్రవ జీవామృతం, ఘన జీవామృతం కాషాయాలు వాడడం వలన పురుగులు తెగుళ్లను నివారించవచ్చునని అన్నారు. ఖర్చులు తగ్గించుకొని ఆదాయాన్ని పెంచుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది రెడ్డి ప్రియ, సుజాత, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రభాకర్, లోకేశ్వర్‌రెడ్డి, ఇంద్రజ, శివకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల పరిధిలోని పడమటి కోన యూనిట్ పరిధిలో ఉన్న మామిడి రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాల పైన రైతు సాధికార సంస్థ ఎపిసిఎన్ఎఫ్ వారి ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎడిఎ శ్రీలత మాట్లాడుతూ మామిడి పంటల్లో పూత వచ్చే సమయం ఆసన్నమైందని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో అధిక ఆదాయాలు పొందాలని మన ఆరోగ్యాలతో పాటు నేల ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ పద్మావతి గారు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పాటించిన పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ లో ఉన్న అవకాశాలను తెలిపారు. ట్రైనింగ్ లో భాగంగా ప్రకృతి వ్యవసాయ ఆదర్శ రైతు మురళి కృష్ణమామిడి తోటలను రైతులు పరిశీలించి వారు పాటించిన పద్ధతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిసి రెడ్డెన, అంజలి, ఎఇఒ బ్లెస్సి, అనూష, విఎఎ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సి స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్రోపాధ్యాయ సంఘం సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించినటు వంటి పదవ తరగతి స్టడీ మెటీరియల్‌ను బుధవారం మండల విద్యాధికారులు జి.చక్ర ధర్‌రాజు, డి.నాగతిరుమలరావు చేతుల మీదుగా బిపి.శేషయ్య సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరదారెడ్డికి ఎస్‌టియు మండల అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వి.సిద్దయ్య అందించారు. ఈ సంద ర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌తో విద్యార్థుల మంచి మార్కులు పొందడానికి బాగా ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు ముగిసే వరకు మొబైల్ ఫోన్లు, ఆటలు, సినిమాలకు దూరంగా ఉండి పబ్లిక్ పరీక్షలకు బాగా సన్నద్ధమై పుల్లంపేట మండలంలో వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇ ఎస్ కొమ్మ శివప్రసాద్, ఉపాధ్యాయులు భానుప్రకాష్, ఓబులేసు, స్రవంతి పాల్గొన్నారు.

12 మందికి ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాప్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళాను స్థాని శ్రీ టిఎన్‌విఎస్ఆర్ఎం ప్రభుత్వ ఐటిఐలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ట్రైనింగ్ ఆఫీసర్ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాకు రెండు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారని 26 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 12 మంది రూ.18వేల నుంచి నుంచి రూ.25వేల వేతనంతో ఉద్యోగానికి ఎంపి కయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది అశోక్, సురేంద్రబాబు, రమణ, రెడ్డి వరప్రసాద్, ఎపిఎస్ఎస్‌డిసి స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ చౌడయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఆదర్శ పాఠశాల

ప్రజాశక్తి-కలకడ

జాతీయ స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు కలకడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మలంగ్‌షావలి తెలిపారు. బుధవారం రోజు విజయవాడలోని మురళి రిసార్ట్‌లో జరిగిన రాష్ట్రస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో వివిధ జిల్లాల నుంచి ప్రదర్శనలు ప్రదర్శించారు. అన్నమయ్య జిల్లా నుంచి కలకడ ఆదర్శ పాఠశాలకు చెందిన 'బయో ఇంజిన్ అండ్ బయో కెమికల్ క్లీనర్స్' అనే విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను సుమతి కెమిస్ట్రీ ఉపాధ్యాయురాలి పర్యవేక్షణలో విద్యార్థులు బిఎండి సుహేల్, ఎస్ఎండి రేహాన్ ప్రదర్శించారు. రాష్ట్రస్థాయి న్యాయ నిర్ణేతలు కలకడ ఆద ర్శ పాఠశాలకు చెందిన ప్రాజెక్టును జాతీయ స్థాయికి ఎంపిక చేయడం జరిగింది. త్వర లో పుదుచ్చేరిలో జరగబోయే జాతీయస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో ఈ ప్రాజెక్టు ప్రదర్శింపబడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైనందుకు ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్ నాయుడు, ప్రిన్సిపల్ కె.మలాంషావలి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను, ఉపాధ్యాయులు సుమతీని అభినం దించారు.

పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్

మండల పరిధిలోని పుల్లంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఉడుమువారిపల్లి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వీధు లలో ఉన్న చెత్త దిబ్బలు, పంచాయతీ మోటర్లు దగ్గర ఉన్న పిచ్చి మొక్క లను, ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్త దిబ్బలను జెసిబి ద్వారా ట్రాక్టర్ల సహాయంతో పంచాయతీకి దూరంగా తరలించినట్లు తెలిపారు. పంచాయతీ పచ్చదనం, పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ చెత్తను బయట పడేయకుండా పంచాయతీ ఇచ్చిన తడి, పొడి డబ్బాలలో వేసి గ్రీన్ అంబాసిడర్‌ల ద్వారా చెత్త సంపద కేంద్రంలోకి తరలించడం జరుగుతుందని పేర్కొన్నారు. పంచాయతీలో ఎక్కడైనా ఎల్ఇడి బల్బులు వెలగకండా ఉంటే తన దృష్టికి తీసుక వస్తే తక్షణమే ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హత్య కేసు కొట్టివేత

ప్రజాశక్తి-రాయచోటి

మండల పరిధిలోని శిబ్యాల గ్రామం వైకుంఠరాచపల్లి ఎర్రచెరువులో మేకల మేపుతున్న మహిళలపై హత్య జరిగిన సంఘటన కేసును బుధవారం కొట్టి వేసినట్లు డి.నాగముని బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 సంవత్సరంలో మహిళ హత్య కేసు సంచలనం సృష్టించిందిన్నారు. 2018లో ఇద్దరు వ్యక్తులపై నేర ఆరోపణ కింద ఎన్.సాంబశివ, ఎం.బాలాజీ అనే ఇద్దరు వ్యక్తులపై కేసును నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి విచారం జరుగుతుండగా 24 మందిని ఈ విచారణలో 24 మందిని ఛార్జ్ సీటు పొందుపరచగా అందులో ముగ్గురు సిఐలను, ఇద్దరు విఆర్ఒలను, అడిషనల్ పీపీ జగన్ మోహన్‌రెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూషన్ తరపున వాదించిగా నిందితుల తరపున వాదోపాలు జరిపారు. ఈ కేసును ఐదవ జిల్లా జడ్జి కృష్ణ కుట్టిన్ కేసు కొట్టి వేయడం జరిగిందని న్యాయవాది నాగముని తెలిపారు.